




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం మార్చి 28 2025 | సంపుటి :0 | సంచిక : 165 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# రాజకీయ ప్రయోజనం లేకపోవడంతోనే తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్లు పెంచలేదు: సీఎం రేవంత్



- డీలిమిటేషన్ వల్ల జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోకూడదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.
- ప్రస్తుతం ఉన్న అసెంబ్లి నియోజకవర్గాలను కొనసాగించాలని కోరారు.
- తెలంగాణ అసెంబ్లి నియోజకవర్గాలను 153కు పెంచాలని తీర్మానం ప్రవేశపెట్టారు.
- జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచాలని సూచించారు.
- దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పాలసీ పాటించగా, ఉత్తరాది రాష్ట్రాలు పాటించలేదని అన్నారు.
- 1971 రాజ్యాంగ సవరణ ద్వారా 25 ఏళ్లపాటు డీలిమిటేషన్‌ను నిలిపివేశారు అని గుర్తు చేశారు.

డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు.




మిగతా 2లో

## అప్పుల్లో తెలంగాణ రైజింగ్: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


2లో

తెలంగాణ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

హైదరాబాద్: అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పులు చేయాల్సిన స్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు రూ. 12వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## మేమూ అలా చేస్తే.. కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైల్లో ఉండేవారు: సీఎం రేవంత్‌రెడ్డి



బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

2లో

## మాకు వచ్చినవి సున్నా సీట్లే..

### మరి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చిందెంత?: కేటీఆర్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని భారాస ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు.


2లో

హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని భారాస ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రతి పనిలోనూ గత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నవారు.. కేంద్రం తీరుపై ఎందుకు మాట్లాడలేకపోతున్నారని నిలదీశారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. “తెలంగాణకు మేలు జరగాలి. రాష్ట్ర ప్రజలు బాగుండాలి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా.. రాష్ట్రం బాగుండాలన్నదే మా సంకల్పం.

## తెలంగాణ అసెంబ్లీలో కాగ్ నివేదిక.. ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి


2లో

తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో కాగ్ నివేదికను

## సిర్పూర్ పేపర్ మిల్లు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి: పాల్వాయి హరీశ్‌బాబు


2లో

సిర్పూర్ పేపర్ మిల్లుకు ఏడేళ్లుగా యూనియన్ ఎన్నికలు నిర్వహించడం లేదని భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు.

# సంపాదకీయం

## సాంస్కృతిక విధానం దిశగా తొలి అడుగు

చారిత్రక సంస్కృతి, నాగరికతా వికాసంలోనూ తెలంగాణ ఘనమైన వారసత్వం కలిగి ఉంది. దేశంలో ఏ ప్రాంతానికీ ఈ నేల భౌగోళికత తీసిపోదు. క్రీస్తుకు పూర్వం 221 నుంచి 218 వరకు కోటిలింగాల రాజధానిగా శాతవాహనులు దేశమంతా విస్తరింప చేసిన తొలి తెలుగు రాజ్యం ఇది. ఆ కాలంలోనే హాలుడు 700 గాథలతో 'గాథా సప్తశతి' సంకలనం చేశాడు. ఇది చారిత్రాత్మకమైన కవిత్వం. ప్రపంచ జాతక కథల్లో మొట్టమొదటి 'బృహత్కథ' ఈ గడ్డ నుంచే వచ్చింది. ఆ తర్వాత క్రీస్తు శకం 945లోనే జినవల్లభుడు తొలి తెలుగు కందపద్యంతో కురిక్యాల శాసనం ప్రకటించారు. ఈ శాసనమే తెలుగుకు ప్రాచీన హోదా రావడానికి తోడ్పడింది. అటు తర్వాత పాలకురికి సోమనాథుని 'బసవ పురాణం', గోన బుద్ధారెడ్డి కాకతీయుల కాలం, కులీ కుతుబ్ షా హయాం... అక్కడి నుంచే మొదలైంది తెలంగాణ సాంస్కృతిక సారస్వత కళల వైభవ చరిత్ర. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం పదేళ్లలోనూ ఒక సమగ్ర సాంస్కృతిక విధానాన్ని నాటి ప్రభుత్వం రూపొందించలేకపోయింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర సాంస్కృతిక విధాన రూపకల్పనకు శ్రీకారం చుడుతుందని ఆశిస్తున్నాం. ఎందుకంటే ఇటీవల ప్రఖ్యాత ప్రత్యామ్నాయ సినిమా దర్శకుడు, కవి, రచయిత, చిత్రకారుడు బి. నరసింగరావుతో ప్రభుత్వం చర్చించి ఒక సాంస్కృతిక పాలసీ డాక్యుమెంట్‌ను తయారు చేయించింది.

ఆయన తెలంగాణ హెరిటేజ్‌కు సంబంధించి ఒక విలువైన డాక్యుమెంట్‌ను రూపొందించారు. సాహిత్యం, సాంస్కృతికం, లలిత కళలు, శిల్పకళ, గ్రంథాలయాలు, ప్రదర్శనశాలలు, చలనచిత్రం, నాట్యం, ఫోటోగ్రఫీ మొదలుకొని సమస్త రంగాలను మేళవించి తెలంగాణ రాష్ట్రం కోసం దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనటువంటి కల్చరల్ పాలసీ డాక్యుమెంట్‌ను ఆయన రూపొందించారు. ఏ ప్రభుత్వాలకైనా అభివృద్ధి, సంక్షేమం, ప్రజా పరిపాలనకు సంబంధించి ప్రాధాన్యతలు ముందు వరుసలో ఉంటాయి. అనంతరం శాంతిభద్రతలు, ఆర్థిక వ్యవహారాలు. ఆ తర్వాతే సాహిత్యం, సంస్కృతి, క్రీడలు, ఇతర కళావారసత్వానికి సంబంధించినవి ఉంటాయి. కానీ కాలయాపన చేయకుండా ఒక సమగ్ర సంస్కృతిక పాలసీని చర్చించి, ఆమోదిస్తే తరతరాలుగా కొనసాగుతున్న వారసత్వం కాట కలువకుండా నిలిచిపోతుంది. బి. నరసింగరావు రూపొందించిన సమగ్ర సాంస్కృతిక విధానపత్రం మహా అద్భుతంగా ఉంది. ఒక ఆర్కిటెక్ట్ బహుళ అంతస్తుల భవనాన్ని కళాత్మకంగా ఎలా గీస్తారో నర్సింగరావు అలాగే ఒక విజనరీ ప్రణాళికను రూపొందించారు. అందులో ఇప్పుడు ఉన్న సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, ఫోటోగ్రఫీ అకాడమీ, జానపద అకాడమీలను ప్రతిపాదించారు. వీటితోపాటు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, గ్రంథాలయాలు, మ్యూజియాలు, ఇవన్నీ వివిధ శాఖల కింద పనిచేస్తున్నాయి. అన్నిటి అనుసంధానం జాప్యం కాకుండా సీఎంఓ స్థాయిలో కార్యదర్శి నేతృత్వంలో సాంస్కృతిక సచివాలయం ఒకటి ఉండాలి. సంబంధిత పర్యవేక్షణ ద్వారా ఇది కొనసాగుతుండాలి. ఇందులో సాహిత్యం, కళలు, చలనచిత్రం, సాంస్కృతిక వారసత్వం, జాతీయ అంతర్జాతీయ లావాదేవీలు విభాగాలుగా ఉండాలి. వీటికి గురుత్వ అధికారి నేతృత్వం వహించాలి. ఆ అధికారి కూడా ఆయా విషయ పరిజ్ఞానంలో నిష్ణాతులై, నిపుణులై ఉన్నవాళ్లను ఎంపిక చేయాలి. ఇకపోతే సాహిత్యం, కళల కోసం పూర్వ తెలంగాణలోని పది జిల్లా కేంద్రాల్లో 25 ఎకరాల ప్రభుత్వ భూమిలో భవన సదుపాయాలు నిర్మించాలి. ఇందులో ఆ పూర్వ జిల్లా పరిధిలో చిత్రకళ, శిల్పకళ, సంగీతం, నృత్యం, నాటకం, ఫోటోగ్రఫీ, సినిమా అధ్యయనం, వారసత్వ అధ్యయనానికి కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. ఒక కళాశాల నిర్మించాలి. అదే స్థలంలో 800, 250, 150 సీట్ల కెపాసిటీతో, వేర్వేరు వైశాల్యాలతో మూడు ఆడిటోరియాలు నిర్మించాలి. మరొక భవనంలో మ్యూజియం, గ్రంథాలయం, ఫోటోగ్రఫీ, పెయింటింగ్ ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు వీలుగా ఆర్ట్ గ్యాలరీలు ఏర్పాటు చేయాలి. మరొక భవన సదుపాయంలో శిక్షణా శిబిరాల రిహార్సల్స్ కోసం విశాలమైన షెడ్లు, సిబ్బంది వసతిగృహాలు నిర్మించాలి.

ఇలా పది జిల్లాల్లో నిర్మిస్తూ సమాంతరంగా పది ఎకరాలలో హైదరాబాదులో మరొక భవన సదుపాయాన్ని నిర్మించాలి. కెఫటేరియా, రెస్టారెంట్ గెస్ట్‌హౌస్‌లు డబుల్ బెడ్ రూమ్‌లు ఉండాలి. వీటితో పాటు తెలంగాణలో అన్ని నగరాల్లో ఉన్న ఆడిటోరియాలను పునరుద్ధరించాలి. తెలంగాణలో నడుస్తున్న బాల భవన్‌లు, శిల్పారామాలను పునర్ నిర్మించి తెలంగాణ సాంస్కృతిక కేంద్రంగా కార్యకలాపాలను నడిపించాలి. ప్రపంచంలో సినిమా రంగానికి సంబంధించిన అధ్యయనం గొప్పగా సాగుతున్నది. మన తెలుగు రాష్ట్రంలో అది లేదు. ఇందుకోసం ఫిలిం సొసైటీలు నటీనటుల సంఘాల సమన్వయంతో సంప్రదింపులు జరపాలి. సినిమాలకు సంబంధించి నిర్మాణం, ప్రచారం, ప్రదర్శన ఇలా మూడు పాయలుగా అభివృద్ధి చేయాలి. అందుకుగాను 10 ఎకరాల స్థలంలో ఒక సినిమా కాంప్లెక్స్ తీర్మానం చేపట్టి దానికి 'పైడి జయరాజు సినిమా ఘర్' పేరు పెట్టాలి పైడి జయరాజ్ తెలంగాణ సినిమా వైతాళికుడు. 1928లోనే తెలుగు సినిమాను జాతీయ స్థాయిలోకి తీసుకువెళ్లిన ఘనుడు. 'సినిమా నిర్మాణ' కేంద్రం ఒకటి ఏర్పాటు చేయాలి అందులో నిర్మాతల సంఘం, దర్శకుల సంఘం, సినిమా కళాకారుల సంఘం, సినిమా జర్నలిస్టుల సంఘం ఏర్పాటు చేయించాలి. ఈ సినిమా ఘర్లోనే 24 కళలకు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగుతాయి.

సినిమా అధ్యయనం శిక్షణ పరిశోధన కోసం 'శ్యాం బెనగల్ సినిమా అకాడమీ' ఏర్పాటు చేయాలి. ఈ అకాడమీ ఆవరణలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, ఫిలిం ఫెస్టివల్ డైరెక్టరేట్, బాలల చలనచిత్రాల క్లబ్, ఫిలిం సొసైటీ కార్యాలయాల వేదిక, ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లు ఉండాలి. ఈ ఆవరణలో కూడా మూడు థియేటర్లు ఉండాలి. మరొకటి 'బిఎస్ఎన్ సినిమా రిక్రియేషన్ సెంటర్'. బిఎస్ఎన్ అంటే బిఎస్ నారాయణ తెలంగాణ సినిమా వైతాళికుడు. అలాగే 'కాంతారావు సెంటర్ ఫర్ సినిమా హ్యాబిటేషన్' ఏర్పాటు చేయాలి. ఇందులో చిత్ర పరిశ్రమ కార్మికులు, కుటుంబాల కోసం అపార్ట్‌మెంట్లు నిర్మించాలి. మరొకటి 'పిఆర్ చలనచిత్ర స్టూడియోస్' నిర్మిస్తే ఇది అత్యంత ఆధునిక స్టూడియో అవుతుంది. అప్పుడే తెలంగాణ సినిమాకు దేశవ్యాప్తంగా ఖండాంతరంగా గుర్తింపు గౌరవం లభిస్తాయి. పిఆర్ అంటే ప్రభాకర్ రెడ్డి. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. పురానిక్షిప్తశాఖ, గ్రంథాలయాలు, ప్రచురణలు, రాష్ట్రీయ బుక్ ట్రస్ట్, రాష్ట్ర ప్రచురణల విభాగం విడివిడిగా ఏర్పాటు చేయాలి. తెలంగాణ వైతాళిక చరిత్రను ప్రపంచానికి తెలియజేసేందుకు నాగోబా జాతర, బతుకమ్మ, హైదరాబాద్, రాజా దీనదయాల్, వట్టికోట ఆళ్వారుస్వామి, సురవరం ప్రతాపరెడ్డి, మక్దూం, గణేష్ నిమజ్జనం, కోటిలింగాల, ఫణిగిరి, నందికొండ... తదితర వారసత్వాలపై కాఫీ టేబుల్ బుక్ ప్రచురించాలి. ఇందుకు సంబంధించిన బడ్జెట్, ఐదేళ్ల ప్రణాళికలు రూపొందించి దశలవారీగా కార్యకలాపాలను కొనసాగించవచ్చు. ఇందులో రాష్ట్ర బడ్జెట్‌లో ఒక శాతం మాత్రమే ఖర్చు అవుతుందని బి. నర్సింగరావు తన డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక విధానానికి సంబంధించి 22 పుటల్లో రూపొందించిన ఈ పత్రం భావి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

# రాజకీయ ప్రయోజనం లేకపోవడంతోనే తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్లు పెంచలేదు: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "డీలిమిటేషన్ వల్ల జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోకూడదు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలనే కొనసాగించాలి. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాలను 153కు పెంచాలి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచాలి. జనాభా నియంత్రణపై కేంద్రం ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలు పాటించాయి. ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించలేదు. ప్రస్తుతం డీలిమిటేషన్ జనాభా ప్రాతిపదికన జరుగుతోంది. 1971లో రాజ్యాంగ సవరణ ద్వారా డీలిమిటేషన్‌ను 25 ఏళ్లు నిలిపేశారు. డీలిమిటేషన్‌పై గందరగోళం నెలకొంది. ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్ డీలిమిటేషన్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. జనాభా ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజనను అంగీకరించబోమని తీర్మానం చేశారు. జనాభా ఆధారంగా చేసే డీలిమిటేషన్‌ను వాజ్‌పేయీ కూడా వ్యతిరేకించారు. డీలిమిటేషన్‌పై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని కొందరు అంటున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం లోక్‌సభలో 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. డీలిమిటేషన్ జరిగితే ఇది 19 శాతానికి పడిపోతుంది. దీనికి వ్యతిరేకంగా అందరూ ఒకే మాటపై ఉండాలి. ప్రభుత్వం పెట్టే తీర్మానానికి పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలి. ఏపీ, తెలంగాణ శాసనసభ నియోజకవర్గాలు పెంచాలని పునర్విభజన చట్టంలో ఉంది. ఇప్పటి వరకు శాసనసభ నియోజకవర్గాలను పెంచలేదు. 2011 జనాభా లెక్కల ప్రకారమే సిక్కిం, జమ్మూ కశ్మీర్ నియోజకవర్గాలను పెంచారు. రాజకీయ ప్రయోజనం లేకపోవడంతోనే తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్లు పెంచలేదు. 24 శాతం ప్రాతినిధ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 36 శాతం పన్నులు కడుతున్నాయి. కేంద్రం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు చాలా తక్కువ వస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్‌కు మాత్రం కేంద్రం పన్నుల్లో ఎక్కువ వాటా ఉంది" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# మేమూ అలా చేస్తే.. కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైల్లో ఉండేవారు: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తే.. కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైలులో ఉండేవారన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఎవరైనా డ్రోన్ ఎగరవేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. కానీ, డ్రోన్ ఎగరవేశారని ఒక ఎంపీ మీద కేసు పెట్టి చర్లపల్లి జైలులో వేశారు. రూ.500 జరిమానా వేసే కేసులో జైలులో పెట్టి వేధించారని సీఎం అన్నారు. నా బిడ్డ పెళ్లికి కూడా మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లాను. నేను కూడా అలా ప్రతీకార రాజకీయాలు చేయదలిస్తే.. ఇప్పటికే కొందరు జైలులో ఉండేవారు. కేటీఆర్, కేసీఆర్‌ను జైల్లో వేయాలని చాలా మంది మమ్మల్ని అడుగుతున్నారు. కానీ, అక్రమ కేసులు పెట్టి వాళ్లను జైలుకు పంపే కక్షపూరిత రాజకీయాలు చేసే వ్యక్తిని కాదు" అని రేవంత్ అన్నారు.

"భారాస మొదటి విడత ప్రభుత్వం కేవలం రూ.13 వేల కోట్లు రుణమాఫీ చేసింది. తొలి విడత రుణమాఫీకి ఐదేళ్లు తీసుకున్నారు. రెండోసారి గెలిచాక రుణమాఫీని అసలు పూర్తే చేయలేదు. నాలుగేళ్ల తర్వాత మాత్రం రూ.11 వేల కోట్లు మాఫీ చేశారు. నాలుగేళ్ల తర్వాత రుణమాఫీ చేసినందుకు వాటికి వడ్డీ రూ.8,500 కోట్లకు పైగా అయ్యింది. మేం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.26వేల కోట్లు రుణమాఫీ చేశాం. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకొని రైతుబంధు కూడా వేయలేదు. భారాస ఎగవేసిన రైతుబంధు రూ. 7,625 కోట్లు మేం చెల్లించాం. వరి వేస్తే ఉరే అని మాజీ సీఎం స్వయంగా బెదిరించారు. మేం మాత్రం వరి వేసిన వారికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చాం" అని రేవంత్ తెలిపారు. కమీషన్ల కోసం ప్రాజెక్టుల రీడిజైన్ ప్రాజెక్టుల కోసం పేదల భూములు తీసుకున్న కేసీఆర్.. వాళ్ల బంధువుల భూములు మాత్రం తప్పించారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న రైతులు ఆందోళన చేయలేదా? అని ప్రశ్నించారు. 14 గ్రామాల ప్రజలను పోలీసులతో కొట్టించి బలవంతంగా భూసేకరణ చేశారన్నారు. " ప్రాజెక్టు వద్ద ఎవరికి భూములు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయో నిజనిర్ధారణ కమిటీ వేద్దామా? కేసీఆర్ ఫామ్‌హౌజ్ చుట్టూ కాలువలు తీసినట్లు నిరూపిస్తాను. నేను భూసేకరణను వ్యతిరేకించలేదు.. పరిహారం చెల్లించాలని ధర్నాలు చేశాను. కమీషన్ల కోసం ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశారు. రూ.36వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి.. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం చేపట్టారు. కాళేశ్వరం అవినీతి విషయంలో త్వరలోనే వీళ్లు జైలుకు వెళ్తారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఏకసభ్య కమిషన్ నివేదిక ఇచ్చింది" అని రేవంత్ అన్నారు.

# తెలంగాణ అసెంబ్లీలో కాగ్ నివేదిక.. ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టారు. 2023-24 ఆర్థిక ఏడాది ఫైనాన్స్ అకౌంట్స్, అప్రోప్రియేషన్ అకౌంట్స్‌పై కాగ్ నివేదిక సమర్పించారు. ఇందులో 2023-24 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు, చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లుగా పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాలో 79 శాతం వ్యయం అయిందని తెలిపారు. జీఎస్డీపీలో వ్యయం అంచనా 15 శాతంగా పేర్కొన్నారు. ఆమోదం పొందిన బడ్జెట్ కంటే అదనంగా అంచనాల్లో 33 శాతం ఖర్చు అయింది. అదనంగా రూ.1,11,477 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.

### కాగ్ నివేదిక ప్రకారం..

వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ ద్వారా రూ.10,156 కోట్లు తీసుకున్న ప్రభుత్వం
రూ.35,425 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్‌ను 145 రోజుల పాటు వాడుకుంది
2023-24లో వడ్డీల చెల్లింపుల కోసం రూ.24,347 కోట్ల వ్యయం
వేతనాలకు రూ.26,981 కోట్లు ఖర్చు
ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.83 శాతం నిధులు
2023-24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు మొత్తం రూ.9,934 కోట్లు
రెవెన్యూ రాబడుల్లో 45 శాతం వేతనాలు, వడ్డీ చెల్లింపులు, పింఛన్లకే ఖర్చు
రెవెన్యూ మిగులు రూ.779 కోట్లు
రెవెన్యూ లోటు రూ.49,977 కోట్లు, జీఎస్డీపీలో రెవెన్యూ లోటు 3.33 శాతం
2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు రుణాల మొత్తం 4,03,664 కోట్లు
2023-24 ముగిసే వరకు జీఎస్డీపీలో అప్పులు 27 శాతం
2023-24 వరకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల మొత్తం రూ.2,20,607 కోట్లు
2023-24లో మూలధనం కింద రూ.43,918 కోట్ల ఖర్చు
స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు రూ.76,773 కోట్లు
స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధుల్లో 11 శాతం పెరుగుదల

# సిర్పూర్ పేపర్ మిల్లు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి: పాల్వాయి హరీశ్‌బాబు

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్: సిర్పూర్ పేపర్ మిల్లుకు ఏడేళ్లుగా యూనియన్ ఎన్నికలు నిర్వహించడం లేదని భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. యాజమాన్యంతో కొంత మంది అధికారులు కుమ్మక్కై ఎన్నికలను వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆయన మాట్లాడారు. "రాష్ట్రంలో సగటున రోజుకు 70 రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా.. 20మంది వీటిలో చనిపోతున్నారు. మన సోదరి, యువ ఎమ్మెల్యే కూడా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని జాతీయ రహదారుల పక్కన ట్రామాకేర్ సెంటర్లు నిర్వహించాలి. రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని తక్షణమే ట్రామాకేర్ సెంటర్‌కు తరలించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు. వీటిలో అన్ని రకాల సర్జన్లను అందుబాటులో ఉంచాలి. ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఉంది. వీటికి అనుసంధానంగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి" అని పాల్వాయి హరీశ్‌బాబు కోరారు.

# మాకు వచ్చినవి సున్నా సీట్లే..

## మరి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చిందెంత?: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

పదవులు, అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడకపోవడం బాధేసింది. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రథకాలను కేంద్రం అనుకరిస్తోంది. మనకు జరిగిన అన్యాయంపై డిప్యూటీ సీఎం ఎందుకు మాట్లాడటం లేదు?

పార్లమెంట్ ఎన్నికల్లో మాకు ఒక్క సీటు కూడా రాలేదని విమర్శిస్తున్నారు. మాకు వచ్చింది సున్నానే.. మరి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకి వచ్చింది గుండు సున్నా కాదా. కొట్లాడకపోతే కేంద్రం నిధులు ఇవ్వదు... పోరాడాల్సిందే. కేంద్రంతో గట్టిగా మాట్లాడేందుకు మేం కూడా మద్దతిస్తాం. సత్సంబంధాలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు. మేం కూడా అప్పట్లో కేంద్రంతో సఖ్యతతోనే ఉన్నాం. ఏమీ రాలేదు. తెలంగాణలోని ప్రముఖ ఆలయాలకు కేంద్రం ఒక్క రూపాయి అయినా ఇచ్చిందా? సమ్మక్క-సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలి. కుంభమేళాకు నిధులు ఇస్తున్న కేంద్రం.. సమ్మక్క-సారలమ్మ జాతరకు ఎందుకు ఇవ్వదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

### స్థిరాస్తి రంగం కుప్పకూలింది

ఫార్మా సిటీపై ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. " ఒకసారి ఫ్యూచర్ సిటీ అంటారు. మరోసారి ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ అంటారు. ఈ ప్రభుత్వ విధానాల వల్ల స్థిరాస్తి రంగం కుప్పకూలింది. వ్యాపారం జరగక స్థిరాస్తి వ్యాపారులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్రంలో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ తన సొంత అవసరాల కోసం నిర్మించలేదు. కాళేశ్వరం కూలిపోతే.. మల్లన్న సాగర్ నుంచి నీళ్లు ఎలా తీసుకువస్తారు?


### తులం బంగారం ఎక్కడ?

అద్దెలు చెల్లించకపోవడంతో గురుకుల భవనాలకు తాళాలు వేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉంటే మేం కూడా చెల్లించాం. ఈ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చింది 11 వేల ఉద్యోగాలు మాత్రమే. మేం పరీక్షలు నిర్వహించిన వాటికే వీళ్లు నియామకపత్రాలు ఇచ్చారు. గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేస్తామన్నారు.. చేయలేదు. కోటి మంది మహిళలకు రూ.2500 చొప్పున ఇస్తామన్నారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం కోసం ఎదురు చూస్తున్నారు.

పేరుకు ప్రజా పాలన.. చేసేది ప్రజా పీడన. విఫల పాలనకు విజయోత్సవాలు చేస్తున్నారు. ప్రజలు గోల్డ్ అని వీళ్లకు ఓట్లేశారు. కానీ, రోల్డ్ గోల్డ్ అని తేలింది. రేవంత్‌రెడ్డి ఎందుకు జైలుకెళ్లారు? స్వాతంత్ర్య పోరాటం చేసి ఆయన జైలుకు వెళ్లారా? మీ ఇంటిపై డ్రోన్ ఎగరేస్తే మీరు ఊరుకుంటారా? కుటుంబాలు మీకే ఉంటాయా.. మాకు ఉండవా? నేను కూడా తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్ జైలుకు వెళ్లా" అని కేటీఆర్ అన్నారు.

# అప్పుల్లో తెలంగాణ రైజింగ్: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి



"రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి అప్పుల అప్పారావు, రొటేషన్ చక్రవర్తిలా ఉంది. రాష్ట్ర దుస్థితికి మొదటి ముద్దాయి భారాస అయితే.. రెండో ముద్దాయి కాంగ్రెస్. డీలిమిటేషన్ మీద రాహుల్‌గాంధీ వైఖరి చెప్పాలి. 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.63 లక్షల కోట్లు అప్పులు చేసింది. అప్పులు చేయటంలో మాత్రమే తెలంగాణ రైజింగ్ కనిపిస్తోంది.

గత ప్రభుత్వం చేసిన లక్షల కోట్ల విధ్వంసం వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది. గత ప్రభుత్వ దారిలోనే ఈ ప్రభుత్వం నడవటం బాధాకరం. తెలంగాణకు కేంద్రం నిధులు ఇవ్వలేదంటూ అవాస్తవాలు మాట్లాడొద్దు. కాంగ్రెస్ కూటమిలో చేరేందుకు భారాస ప్రయత్నిస్తోంది. డీలిమిటేషన్‌తో అన్యాయం అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు. కుటుంబ పార్టీలే భాజపాని వ్యతిరేకిస్తున్నాయి. భారాస ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంపై ఈ ప్రభుత్వం ఏం చర్య తీసుకుంటుందో చెప్పాలి. గత ప్రభుత్వం 11 శాతానికి తెచ్చిన వడ్డీలను రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్నారో.. లేదో? చెప్పాలి. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై ఏం చర్యలు తీసుకున్నారు?" అని ఏలేటి ప్రశ్నించారు.

# అలరించిన "పిఎంశ్రీ" పథకం కార్యక్రమాలు

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎం శ్రీ పథకం కార్యక్రమాల లో భాగంగా గురువారం పాఠశాల లో వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంవత్సరం పాఠశాలలో జరిగినటువంటి జాతీయ గణిత దినోత్సవం, జాతీయ సైన్స్ దినోత్సవం, బాలికల సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమం, ప్రత్యేక విద్యకు సంబంధించి సిడబ్ల్యు ఎస్ ఎన్ కార్యక్రమం తో పాటు అనేక విషయాలతో పాటు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో అధిక ఉపస్థితి అటెండెన్స్ కలిగినటువంటి విద్యార్థులను, చదువులో ప్రగతి శ్రద్ధ కనబరుస్తున్న విద్యార్థులను అభినందిస్తూ బంగారు పథకాలను అందజేయడం జరిగింది. రాబోయే రోజుల్లో పాఠశాలలో ఎలాంటి పురోగతి ఉంటుంది అనే విషయాన్ని ఈ సంవత్సరం ఎంతవరకు చేరుకున్నామనే






విషయాన్ని గౌరవ ప్రధానోపాధ్యాయులు తమ నివేదికలో తెలియజేశారు. పదవ తరగతి విద్యార్థుల 100% ఉత్తీర్ణత సాధిస్తారని వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలో 500 మంది లక్ష్యంగా బడిబాట కార్యక్రమం చేపడతామని, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందజేస్తూ తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పెద్దల సహకారంతో ముందుకు వెళతామని ప్రకటించారు. కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభా పాటవాలతో చక్కటి సందేశాత్మక నృత్య ప్రదర్శనలు జరిగినాయి. అందులో పర్యావరణ పరిరక్షణ, చదువు వల్ల లాభాలు, డ్రగ్స్ మత్తు పదార్థాల వల్ల నష్టాలు తెలియజేసే సందేశాత్మక నాటికలు, నృత్యాలు, ఏక పాత్రలు జరిగాయి. ఇట్టి కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం కాంప్లెక్స్ లోని డబ్బా, అమ్మక్కపేట, కోమటి కొండాపూర్, ఇబ్రహీంపట్నంలోని ప్రాథమిక పాఠశాల, వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆయిల్ పాం సాగు కోసం ముందుకు రావాలి

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

**– ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అదికారి అకు రాజ్ కుమార్**

రైతులు ఆయిల్ పాం సాగు కోసం ముందుకు రావాలని ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అదికారి అకు రాజ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ మరియు ఫకీర్ కొండాపూర్ గ్రామం లో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో ఆయిల్ పాం



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అదికారి రాజ్ కుమార్

పంట సాగు పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ఎఓ మాట్లాడుతు ఆయిల్ పామ్ పంట సాగు వల్ల ప్రభుత్వం అందిస్తున్న రాయితీ మరియు ఆయిల్ పామ్ దిగుబడి, ఆయిల్ పామ్ సాగు లో ఇతర పంటలతో పోల్చితే వచ్చే లాభాల గురించి



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్

రైతులకి వివరించారు. కాగా, 13 ఎకరాలలో రైతులు ఆయిల్ పామ్ పంట సాగుకి ముందుకి రావడం జరిగింది.

**ఈకార్యక్రమం లో ఎఇఓ సాగర్, కంపెనీ ప్రతినిధి అక్షయ్, రైతులు పాల్గొన్నారు.**

# మత సామరస్యానికి సోదరభవానికి ప్రతీక రంజాన్...

**– ముస్లిమ్ మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది:**
**– పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు...**

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మంటపం లో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని గురువారం రోజున ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆధ్వర్యంలో అధికారిక ఇఫ్తార్ విందు నిర్వహించడం జరిగింది. తెలంగాణ శాసనసభ సమావేశాల సందర్భంగా హైదరాబాద్ లో ఉన్నందున ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఇట్టి కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. ఈ సందర్భంగా ఆయన



ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మత సామరస్యానికి, సోదర భావానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్యే కొనియాడారు. సుల్తానాబాద్ పట్టణంలో మొదటి నుండి అన్ని వర్గాల ప్రజలు సమైక్యత, సోదర భావంతో ఉంటూ ఎప్పుడు ఏ చిన్న విభేదాలు లేకుండా పండుగలను జరుపుకోవడం గొప్ప విషయమని అభినందించారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో మండలంలో



మసీదుల అభివృద్ధికి తన వంతు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణు గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, ముస్లిం మత పెద్దలు, మైనారిటీ సోదరులు, కాంగ్రెస్ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి తవ్వకాలపై అధికారుల చర్యలేవి

**ఎమ్మెల్యే విజయరమణారావుతో పాటు ప్రభుత్వ అధికారి గిర్దావరుపై సంచలన వ్యాఖ్యలు**

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**

**-రూ.2కోట్ల ప్రభుత్వ ధనం లూటీ..**
**-అధికారుల అండదండలతోనే మట్టిదందా..**
**-గత ఎమ్మెల్యే అవినీతిపై తొడగొట్టినవారికీ హస్తం..**
**-అక్రమార్కులను జైలు ఊచలు లెక్కపెట్టిస్తా..**
**-బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సురేష్ రెడ్డి.**

జిల్లాలో కొనసాగుతున్న అక్రమ మట్టిదందాపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుతో పాటు ప్రభుత్వ అధికారి గిర్దావరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గత కొంతకాలంగా ఆరుగురు ఇటుకబట్టీల యజమానులు మైనింగ్ శాఖ



నుండి అనుమతి పొందిన దానికంటే ఎక్కువమొత్తంలో మట్టి తవ్వకాలు జరుపుతున్నారని, విషయం వెలుగులోకి రావడంతో కొన్ని రోజులు నిలిపివేసినట్లు చేసిన అధికారులు, మళ్ళీ అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చిన నివేధిక ప్రకారం 70వేల మెట్రిక్ టన్నులకు గానూ లక్షా 65వేల 5వందల పది మెట్రిక్ టన్నుల మట్టిని తవ్వుకున్నారని పేర్కొన్నారు. దీనిపై ఒక్కో కంపినీ కి రూ.38లక్షల 56వేల 3వందల ఇరవై తొమ్మిది జరిమానా విధించారని వివరించారు. జరిమానా చెల్లించకుండానే ఇటుకబట్టీల యాజమాన్యం మట్టిని తరలించడంపై సురేష్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. గిర్దావరు ఆడియో ప్రదర్శన..

అక్రమంగా తరలిస్తున్న మట్టి వాహనాలను వదిలిపెట్టాలని గిర్దావరు సిబ్బందిని ఆదేశిస్తున్న ఆడియో లీకయ్యింది. ఆడియో సంభాషణను సురేష్ రెడ్డి విలేకరుల ముందు ప్రదర్శించారు. ఎవరి అండ చూసుకొని గిర్దావరు వాహనాలను వదిలిపెట్టమని ఆదేశిస్తున్నారో తెలపాలన్నారు. గత ప్రభుత్వంలోని మాజీ ఎమ్మెల్యే అక్రమంగా ఇసుక, మట్టి దందా చేస్తూ రూ.కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నాడని, తాను గెలిచిన వెంటనే జైలుకు పంపిస్తా అంటూ తొడగొట్టిన ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రజలకు ఏం సమాదానం చెబుతారని నిలదీశారు. రూ.2కోట్ల స్కాములో ఎమ్మెల్యేకు హస్తం ఉందని ఆరోపించారు.

గత మూడేళ్ళుగా ఇసుక, మట్టి తవ్వకాలపై న్యాయస్థానాల్లో అలుపెరుగని పోరాటం చేస్తున్నానని, ఇప్పటికే గ్రీన్ ట్రిబ్యునల్ కేసులో విజయం సాధించానని తెలిపిన ఆయన, అక్రమార్కులను వదిలిపెట్టబోనని సురేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటుకబట్టీల యజమానులకు వేసిన జరిమానాను ప్రభుత్వ ఖజానాలో జమచేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరు, సంభందిత అధికారులు సత్వరమే స్పందించాలని సురేష్ రెడ్డి కోరారు.

# అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన ఎన్ఎస్ యు ఐ నాయకులు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట మార్చి 27**

ఇల్లందకుంట మండల కేంద్రంలో ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు పసునూటీ అన్వేష్ మీడియా పత్రిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 75 సంవత్సరాలు రాజ్యాంగం పూర్తి చేసుకున్నందున ప్రతి గడపకి రాజ్యాంగం యొక్క విలువ తెలియజేయడం కోసం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర లో రాజ్యాంగం విలువను ప్రతి ఒక్కరికి తెలియజేసేలా మండలంలోని 18 గ్రామాలలో పాదయాత్ర చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఐ వై సి ప్రెసిడెంట్ శివ,ఎన్ ఎస్ యు ఐ నాయకులు ఎం డి బాబర్,నాగరాజు,వంశి,శివ,రాజు కుమార్,అరుణ్, తదితరులు పాల్గొన్నారు

# మహిళను వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

సుందిళ్ల గ్రామానికి చెందిన బోగిరి విజయ్ కుమార్ అనే వ్యక్తి గత కొంతకాలంగా గోదావరిఖని గంగానగర్ కు చెందిన ఒక మహిళను వేధిస్తున్నాడని మహిళా గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారించిన పోలీసులు గురువారం విజయ్ కుమార్ ను పట్టుకొని అరెస్టు చేశారు. కేసులో మహిళకు తెలిసిన అతను అని ఫోన్లో మాట్లాడినందుకు ఫోన్ రికార్డును ఆసరాగా చేసుకొని ఆ మహిళను వేధించడం మొదలు పెట్టాడు. ఈ సందర్భంగా వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఆడపిల్లలకి తెలిసిన వ్యక్తులైన, తెలువని వ్యక్తులతోనైనా ఫోన్లలో, సోషల్ మీడియాలలో ఎక్కువసేపు మాట్లాడటం కానీ, మెసేజ్లు పంపడం కానీ, ఫోటోలు షేర్ చేయడం గానీ చేయకూడదని, వాటి వల్ల సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. సోషల్ మీడియాలో మహిళలు ఎలాంటి ఫోటోలను గాని, వీడియోలను గాని పోస్ట్ చేయరాదని, ముఖ్యంగా వారి కుటుంబానికి సంబంధించిన ఫోటోలను పోస్ట్ చేయరాదని సూచించారు. సైబర్ నేరస్తులు మహిళల ఆడపిల్లల ఫోటోలను మార్ఫింగ్ చేసి వారిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తారని, ఎవరు కూడా సోషల్ మీడియాలో ఫోటోలను వీడియోలను పోస్ట్ చేయరాదని విజ్ఞప్తి చేశారు.

# అంగన్వాడీ కేంద్రాలలో ఈసీసీఈ డే కార్యక్రమం



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

రామగుండం కార్పొరేషన్ 38 డివిజన్లోని ఇంద్రానగర్-1, సంజీవ్ నగర్ 2 అంగన్వాడీ కేంద్రాలలో గురువారం ఈసీసీఈ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫ్రీ స్కూల్ 2 సంవత్సరాల నుండి 5 సంవత్సరాలపిల్లల తల్లిదండ్రులు, పిల్లల గ్రాండ్ పేరెంట్స్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రతి నెల నాలుగవ శనివారం ఈసీసీ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే మార్చి నెల నిర్వహించడం జరిగిందనీ తెలిపారు. పిల్లల తల్లిదండ్రులకు పిల్లల అభివృద్ధి సూచికలు ఎలా గుర్తిస్తామో, రిజిస్టర్ లో ఎలా నమోదు చేస్తామో చూపించారు. అంగన్వాడి టీచర్లు జి.రజిత, జి.మమత పాల్గొన్నారు.

# నవోదయ విద్యార్థికి సన్మానం

**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చి 27.**

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థి విక్రమ్ ఆదిత్యను రామగిరి మండలంలోని బేగంపేట గ్రామంలోని ఎస్పివి పాఠశాలలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల




నిర్వాహకులు చంద్రుపట్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి చెల్లించిన ఐదవ తరగతి విద్యా సంవత్సరం ఫీజును తిరిగి చెల్లిస్తున్నట్లు ప్రకటించారు. మచ్చు పేట గ్రామానికి చెందిన ఈర్ల విక్రమ్ ఆదిత్య బేగంపేట గ్రామంలోని ఎస్పివి పాఠశాలలో చదువుతుండగా నవోదయ పరీక్షలో అర్హత సాధించినందుకు గాను బేగంపేట మచ్చుపేట గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడిన గ్రామస్తులు సాయి ప్రగతి కరస్పాండెంట్ ముత్తే చంద్రమౌళి సేవలను గుర్తు చేసుకుంటూ ఎస్పీవి పాఠశాల యాజమాన్యాన్ని ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో కేశనపల్లి తాజా మాజీ సర్పంచ్ నూనె కుమార్,బేగంపేట నాయకులు దాసరి శివ,ఇల్లందుల సంజీవ్,రుద్రవేణ మల్లేష్,మచ్చుపేట నాయకులు తాళ్లపెల్లి కుమార్,గోవిందుల ఆనంద్,దుండే రాజేందర్, బక్కతట్ల కుమార్,పులిపాక రమేశ్ లు పాల్గొన్నారు.

# నాటు సారాయి తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవు

**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చ్ 27.**

గురువారం రోజున ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మంథని ఆధ్వర్యంలో రామగిరి మండలంలోని,రత్నాపూర్ గ్రామ శివారు,రామగిరి ఖిల్లా దగ్గరలో నాటు సారాయి తయారు చేస్తున్నారని విశ్వసనీయమైన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నాటు సారాయి తయారీకి ఉపయోగించే బెల్లం పానకం సుమారు 200 లీటర్లు ధ్వంసం



చేశారు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్నటువంటి సుమారు ఐదు లీటర్ల నాటు సారాయి సీజ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఎవరైనా నాటు సారాయి తయారుచేసిన,రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఈ తనిఖీలలో సాయికుమార్ ఎస్సై,మహేందర్, శ్రీను,శ్యామ్,రవి,సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేయండి..

**– సీఎంను కోరిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



అసెంబ్లీ సమావేశాల చివరి రోజు రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ పరిశ్రమ ఏర్పాటు గురించి ప్రస్తావించారు. ఎప్పుడో నిజాం కాలంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సారథ్యంలో 62 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ను రామగుండంలో నిర్మించిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో 1Ⅹ800 విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం అది కాకుండా యాదాద్రికి తరలించడం విడ్డూరంగా ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభం నుంచే రామగుండంలో 1Ⅹ800 విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇదే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు సూచనలతో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్మిస్తామని ఎనౌన్స్ చేశారన్నారు. అయితే నేరుగా రామగుండంకు వచ్చినప్పుడు కూడా 8Ⅹ100 త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. వెంటనే ప్లాంట్ ఏర్పాటుకు తగిన సన్నాహాలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ శాఖ లో పనిచేస్తున్న ఆర్టిజన్స్ ను రెగ్యులర్ చేయాలని కోరారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధికి అండగా నిలబడుతాం

**– రేండ్ల శారద కుమారస్వామి**

**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చ్ 27.**



ప్రతీ మహిళా స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి చెందాలని వారి ఆర్థిక అభివృద్ధికి అండగా నిలబడుతామని రేండ్ల శారద కుమారస్వామి తెలిపారు.గురువారం ఆర్ఎస్కె ఆపన్నహస్తం ద్వారా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ తరగతులను పరిశీలించారు.రేండ్ల శారద కుమారస్వామి దంపతులు తమ స్వంత ఖర్చులతో మహిళలకు కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల కొరకు ఎన్ఎసి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి మహిళ తమ సొంత కాళ్లతో నిలుదొక్కుని ఆర్థిక చేయూతను పొందాలని అన్నారు.ఎవరిపై ఆధారపడకుండా స్వయం ఉపాధి పొంది వారి కుటుంబాలకు అండగా ఉండాలన్నారు.ఎవరికి ఎలాంటి సహాయం కావాలన్నా వారి వెంట ఉంటామని నిత్యం మీకు అండగా నిలుస్తామని ఎల్లవేళలా అందుబాటులో ఉండి మీకు తోడుగా నిలుస్తామన్నారు.ఎన్ఎసి ఆధ్వర్యంలో మొత్తం 300 మందికి శిక్షణ నిర్వహించగా గురువారం రెండవ బ్యాచ్ 30 మందికి పరీక్ష నిర్వహించారు.అనంతరం వీరికి సర్టిఫికెట్స్ ను ప్రదానం చేయడం జరుగుతుందన్నారు.

## జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి బియ్యం అందజేత...

**– అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి...**

**కరపత్రం శంకరపట్నం మార్చి27**



రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబానికి శంకరపట్నం మండల జర్నలిస్టు యూనియన్ సంఘ నాయకులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా, మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు కోరెం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. మండలంలోని మక్త గ్రామానికి చెందిన షేక్ అజీజ్, అతని కుమారుడు అయిన షేక్ రెహమాన్, ఇటీవల కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేసి అండగా నిలిచినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, టి యు డబ్ల్యూ జే మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరిమి వెంకటస్వామి, సంఘం నాయకులు గోపు శ్రీనివాసరెడ్డి, బూర్ల వెంకటేష్, నేరెళ్ల సంతోష్ కుమార్, పల్లె స్వరూప, తాళ్లపల్లి సాగర్, తుమ్మ సుధాకర్, చింతం వెంకటేష్, సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మొలంగూర్ లో ఇఫ్తార్ విందు...

**– హాజరైన ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులు...**

**కరపత్రం శంకరపట్నం మార్చి 27**



రంజాన్ మాసంలో మొదలయ్యే రామదాన్ కరీం ఉపవాస దీక్షలో భాగంగా, గురువారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత గురువులు మాట్లాడారు. ముస్లింల పవిత్ర దీక్షలో భాగంగా రంజాన్ నెలలు పురస్కరించుకొని ఒక మాస ముందు, ప్రపంచ దేశవ్యాప్తంగా ముస్లింలు రామదాన్ కరీం పేరున ఉపవాస దీక్షలు చేపట్టడం జరుగుతుందని, పవిత్ర ఉపవాస దీక్షలో భాగంగా ములంగూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ మోహినుద్దీన్ గ్రామంలో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మజీద్ ఈద్గా కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజ్యాంగ విలువలను బీజేపీ కాలరాస్తుంది..

# వెంకట్ రాం రెడ్డి,ప్రణవ్..

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ మర్చి 27**



ఏ రాజ్యాంగంతో బీజేపీ పార్టీ నాయకులు అధికారంలోకి వచ్చారో,ఆ రాజ్యాంగాన్ని బీజేపీ నాయకులు అవమానపరుస్తున్నారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున హుజురాబాద్ పట్టణంలోని సాయి రూప ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన హుజురాబాద్ పట్టణ,మండల జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమ సన్నాహక సమావేశానికి కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్ రాం రెడ్డి తో పాటు ఆయన పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ ఏఐసీసీ పిలుపు మేరకు వచ్చే నెల ఏప్రిల్ రెండు నుండి రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్రీయ పాదయాత్ర పేరుతో కాంగ్రెస్ పార్టీ గ్రామ గ్రామాన పాదయాత్రను నిర్వహించబోతున్నమని,దీంట్లో భాగంగా ప్రతీ కార్యకర్త గడప,గడపకు బీజేపీ చేస్తున్న అరాచకాలను తీసుకువెళ్లాలని కోరారు.రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ను కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అవమానపరిచారని,దానికి వెంటనే క్షమాపణ చెప్పాలని,అనంతరం ఆయన్ను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగ విలువలను కాపాడడం కేవలం కాంగ్రెస్ తోనే సాధ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి,సొల్లు బాబు,మార్కెట్ కమిటీ చైర్మన్,డైరెక్టర్లు,మండల అధ్యక్షుడు,హనుమాన్ దేవస్థాన చైర్మన్,డైరెక్టర్లు,ఎన్ఎస్యూఐ నాయకులు,మహిళా సంఘ నాయకురాలు,సోషల్ మీడియా ఇంచార్జిలు,బ్లాక్ కాంగ్రెస్ నాయకులు,మండల స్థాయి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్ధరాత్రి వేళ పెద్దపల్లి పట్టణం పరిసరాల్లో పోలీస్ కమీషనర్ ఆకస్మిక తనిఖీ:

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి





రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్... బుధవారం అర్ధరాత్రి పెద్దపల్లి లోని సాగర్ రోడ్డు ప్రాంతం లో పెద్దపల్లి పోలీస్ వారు నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం ను, ఎల్లమ్మ చెరువు కట్ట ప్రాంతం, మున్సిపాల్ కాంప్లెక్స్ ఏరియా ప్రాంతాలను ,పట్టణంలో ని ఏటీమ్ సెంటర్ లను ఆకస్మికంగా సందర్శించారు. అర్ధరాత్రి సమయంలో బయట తిరుగు తున్న వారిని ఆపి వారితో మాట్లాడడం జరిగింది. ప్రధానంగా శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక పోలీసులు చేపడుతున్న పోలీస్ పెట్రోలింగ్ తోపాటు, రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరిగే వారి గురించి, గంజాయి, మద్యం సేవించే తిరిగే ఆకతాయిల గురించి, ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద నుండి డ్రోన్ ద్వారా ఆ చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో ఎవరైనా ఉన్నారా అని పరిశీలించడం జరిగింది. ఎటిఎం సెంటర్ లను సందర్శించి అలారం సిస్టమ్, సిసి కెమెరాల పని తీరు, ఇతర భద్రత విషయాలపై సెక్యూరిటీ గార్డ్ తో మాట్లాడి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అదేవిదంగా పెద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని బ్యాంకులలో అలారం సిస్టం, సీసీ కెమెరాలు పనితీరు, సెక్యూరిటీ గార్డ్స్, ఇతర భద్రత పరమైన ఏర్పాట్లు అని సరిగా ఉన్నాయా? లేదా ?అనేది స్వయంగా వెళ్లి తనిఖీ చేసి సంబందించిన అధికారులతో మాట్లాడి భద్రత చర్యలు సరిగా లేని బ్యాంకు లలో ఏర్పాటు చేసే విధంగా చూడాలని అధికారుల ను ఆదేశించడం జరిగింది. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మద్యం షాపులు, ఇతర వ్యాపార సంస్థలు పాటిస్తున్న సమయపాలనపై పోలీస్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

## పేదల భూములు కబ్జా చేసిన రామోజీ ఫిలింసిటీ యజమాన్యం పై కేసు కేసు నమోదు చేయాలి

**– బిపేదలకు కేటాయించిన భూములను వెంటనే పేదలకు ఇవ్వాలి**

**– సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**కరపత్రం సంగారెడ్డి:**



పేదల భూములు కబ్జా చేసిన రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యంపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. సిపిఎం, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకోవడానికి వెళ్ళిన పేదలను, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీతో పాటు, జిల్లా నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. రామోజీ ఫిలింసిటీ దగ్గర నాగన్పల్లి, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 2007 సంవత్సరంలో నాటి ప్రభుత్వం పట్టాలిచ్చిందన్నారు. కానీ ఆ భూమి మీదకు ప్రజలు వెళ్లి నివాసం ఏర్పాటు చేసుకోకుండా రామోజీ సంస్థ దారిని ఆక్రమించి, చుట్టూ గోడ నిర్మించి సెక్యూరిటీని పెట్టి అడ్డుకుంటున్నదనీ ఆరోపించారు. స్థలాలలోకి వెళ్ళిన 75 మంది పేదలపై గతంలో అక్రమ కేసులు పెట్టి సంవత్సరాల తరబడి కోర్టులు చుట్టూ తిప్పిందన్నారు. ప్రభుత్వం దీనిని పరిష్కరించకుండా జాప్యం చేస్తూ, రామోజీ సంస్థకే అనుకూలంగా వ్యవహరిస్తున్నరన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 400 మంది లబ్ధిదారులను వారికి ఇచ్చిన స్థలాల వద్దకు తీసుకెళ్లడంతో పోలీసులు నాయకులపై, పేదలపై కర్కశంగా ప్రవర్తించి అరెస్టులు చేశారన్నారు. ఈ దుశ్చర్యను సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుదన్నారు.తక్షణమే ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రామోజీ సంస్థపై కేసులు నమోదు చేయాలని, పేద ప్రజలకు తమ ఇంటి స్థలాలను అప్పగించి, అక్కడే నివాసం ఉండే విధంగా ఇండ్లు నిర్మించుకోవడానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య, మానిక్, సాయిలు, నర్సింలు, నాయకులు యాదగిరి, నాగేశ్వర రావు, వీరస్వామి, రమేష్ గౌడ్, తది తరులు పాల్గొన్నారు.

## రజక, నాయి బ్రాహ్మణ ఉచిత విద్యుత్తు బకాయిలు చెల్లించాలి..

**– ఆత్మగౌరవ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి...**

**– శాసనమండలిలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్సీ సారయ్య...**

**కరపత్రం శంకరపట్నం మార్చి 27**



గత ప్రభుత్వంలో రజక నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం అందించే ఉచిత విద్యుత్తు బిల్లులను వెంటనే చెల్లించి రజక నాయి బ్రాహ్మణ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని, శాసనమండలి సభ్యులు, రజక జాతి ముద్దుబిడ్డ మాజీ మంత్రి బసవరాజు సారయ్య శాసనమండలిలో ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జరిగిన శాసనమండలి సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యకు ప్రజా సమస్యలపై గళం విప్పేందుకు అవకాశం ఇవ్వగా, జనహృదయనేత, రజక జాతి ముద్దుబిడ్డ, శాసనమండలి సభ్యులు, మాజీ మంత్రి బసవరాజ్ సారయ్య రజక, నాయి బ్రాహ్మణుల రక్షణ కోసం ఎదుగుదల కోసం తన వాని వినిపించారని, గత కొన్ని నెలలుగా ప్రభుత్వం అందించే ఉచిత విద్యుత్తు బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో గ్రామాల్లో, విద్యుత్ శాఖ అధికారులు ఉద్యోగులు రజకు, నాయి బ్రాహ్మణుల ఉచిత విద్యుత్తు కనెక్షన్ తొలగిస్తున్నారని, దీంతో రజక కుటుంబాలు నాయి బ్రాహ్మణ కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి రజక నాయి బ్రాహ్మణ కుటుంబాలకు అండగా ఉండేందుకు నిధులు విడుదల చేసి, ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో రజకుల ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ప్రభుత్వము కేటాయించిన స్థలము ఆక్రమణకు గురైందని, అధికారులు తెలియజేశారని, ఉప్పల్ శివారులో ప్రభుత్వ భూమి ఉందని ఉన్నతాధికారులు సూచించారని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వము ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ,మంత్రివర్గము ప్రత్యేక చొరవ తీసుకొని ఉప్పల శివారులో రజకుల ఆత్మ గౌరవం భవన నిర్మాణానికి స్థలము కేటాయించి పనులు ప్రారంభించాలని శాసనమండలిలో బసవయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, రజకుల నాయి బ్రాహ్మణుల కు అండగా శాసన మండలి గళం విప్పి అండగా నిలిచినందుకు, కరీంనగర్ జిల్లా రజక కులస్తులు, సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ సారయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.
13